ప్రజాశక్తి

శనివారం 8 ఏప్రిల్ 2023 5

పార్వతీపురం మన్యం



ధర్నాలు, రాస్తారోకో చేస్తే చర్యలు

గిరిజన సంఘాల నాయకులతో సిఐ హెచ్చరిక

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంఘాల జెఎసి పిలుపు మేరకు శనివారం ఎమ్మెల్యేలు, మంత్రుల నివాసాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఆందోళనలు చేయొద్దని రూరల్ సిఐ ధనుంజయ రావు కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మండలంలోని గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడానికి నిరసనగా ఆందోళనకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల దిష్టిబొమ్మల దగ్ధం, రాస్తారోకోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతియుతంగా నిరసన తెలియజేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జెఎసి నాయకులు కొండగొర్రి ఉదయ్ కుమార్, మజ్జి నారాయణరావు, ఎపి గిరిజన సంఘం నాయకులు గెమ్మెల జానకీరావు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అపార నష్టం

జిల్లాలో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సాలూరు, పాచిపెంట, మక్కువ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, వీరఘట్టం, సీతానగరం, భామిని తదితర మండలాల్లో అరటి, మొక్కజొన్న, జీడి, మామిడి, పామాయిల్ తోటలకు నష్టం వాటిల్లింది. అనూహ్యరీతిలో కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండగానే వుంటూ సాయంత్రానికి అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడడంతో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పామాయిల్ చెట్లు కూడా నేలకొరగడంతో ఈదురు గాలులు ఎంత బలంగా వీచాయనేది అర్థమవుతోంది.



సాలూరులో నేలకొరిగిన అరటితోట

- ఆందోళన లో రైతులు
- ఇవకపట్టిన నువ్వు పంట
- పరిహారం కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి - సాలూరు

పాచిపెంట మండలంలో ఐదుగురు రైతులకు చెందిన పది ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. సాలూరు మండలంలో మావుడి తోణాం, కందులపదం, మరిపిల్లి, జీగిరాం, కొట్టుపరువు గ్రామాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. 57మంది రైతులకు చెందిన 72ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. సాలూరు మండలం కొట్టుపరువులో 120చెట్లు నేలకొరిగాయి. ఇవేకాక జీడి చెట్లు కూడా నేలకొరగడంతో రైతులు నష్టపోయారు. జీగిరాం రైతు భరోసా కేంద్రం పరిధిలో గల 17ఎకరాలలో మొక్కజొన్న పంట దెబ్బతింది. వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది పంటనష్టం అంచనాల్లో వున్నారు. మార్చిలో గతంలో ఎన్నడూ ఇలాంటి అకాల వర్షాలు పడలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రభుత్వం నుంచి పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

నేల పాలైన మామిడికాయలు

వీరఘట్టం : మండలంలోని గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో పాటు పెనుగాలులతో కూడిన వర్షం వల్ల మామిడి కాయలు నేలరాలాయి. మండలంలోని కిమ్మిలో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే విద్యుత్ స్తంభం కూడా విరిగిపోవడంతో గ్రామమంతా అంధకారంలో గడిపారు. మామిడి కాయలు నేలరాలడంతో వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలోనే రైతు రామి నాయుడు ఇంటి రేకు కూడా గాలికి ఎగిరిపోయింది.


నువ్వు పంటకు నష్టం

జియ్యమ్మవలస : అకాల వర్షంతో నువ్వుల పంటను రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి 8.30 నుండి 10.30 నిమిషాల వరకు సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో పంట పొలాల్లో నీరు చేరింది. పొలాల్లో నువ్వుల మొక్కల్లో నీరు చేరడంతో మొక్కలు ఉబక పట్టి పాడైపోయిందని తెలిపారు. నువ్వుల పంటపై ఎంతో ఆశ పెట్టుకున్నామని మరో పది పదిహేను రోజుల్లో పంట చేతికి వస్తున్న సమయంలో అకాల వర్షానికి చేతికి అందివ్వలేదని రైతాంగం ఆవేదన వర్ణనాతీతం. మండలంలో సుమారు 3వేల ఎకరాల వరకు నువ్వు పంట సాగవుతోంది. పంటలు పండించడానికి, దుక్కి దున్నడానికి, ఎరువులు వేయడానికి పెట్టుబడులు పెరిగాయని వర్షాలు వల్ల తీవ్రంగా నష్టపోయి అప్పులు మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు.



జియ్యమ్మవలసలో నీటిలో ఒంఉన్న నువ్వు పంట

తొలకరిని తలపించేలా..



జియ్యమ్మవలస : వర్షం నీటితో నిండిపోయిన పొలాలు

జియమ్మవలస : వేసవి కాలం తొలకరిని తలపిస్తుంది. అకాల వర్షాల కారణంగా పొలాల్లో నీరు చేరి తొలకరి వచ్చిందా అన్న చందనంగా పొలాలు ఉన్నాయి. గత 15 రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతూ భారీ గాలులు కూడా వేస్తున్నాయి. గురువారం రాత్రి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాకాలం తలదన్నేలా గెడ్డలు, వాగుల్లో నీరు పారడం విశేషం. గాలులు కూడా భారీగా వీయడంతో అరటి పంట నేలకొరిగి రైతులు నష్టపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు అదును వచ్చిందని పెసర, మినుము వంటి అపరాలను రైతాంగం తమ పొలాల్లో జల్లారు. గురువారం రాత్రి మరింత భారీగా వర్షం కురవడంతో ప్రస్తుతం పంట చేతికొస్తున్న నువ్వులు పంటలో నీరు చేరడంతో నీటిపాలైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భారీ వర్షాల వల్ల పెసర, మినుము విత్తనాలు కూడా పాయ్యాయని రైతాంగం వాపోయింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో గాలులు, వర్షాలు ఇంత పెద్దగా తాము ఎప్పుడూ చూడలేదని మేలో వర్షాలు పడేవని, అకాల వర్షాలకు పంటలు పాడైపోయి తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, ఆశించిన ఫలితం చేతికి రాకుండా నేల పాలవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం: అకాల వర్షాలకు మండలంలోని జీడి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షంతో పాటు వీస్తున్న ఈదురుగాలులకు జీడి, మామిడి నేల రాలుతుంది. భారీ వర్షాలకు చెరువులు, పొలాలు నీటితో నిండాయి. గురువారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో అపారిశుధ్య వాతావరణం నెలకొంటుంది. కాలువలు, మురికి కుంటలు, బోర్లు వద్ద నీటి నిల్వతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు చర్యగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు, సర్పంచులు కోరుతున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని

అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి -కలెక్టరేట్

బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు ఆదివాసీ, గిరిజన, రైతు, రైతుకూలీ, వ్యవసాయ కార్మిక, వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గిరిజన సామాజిక భవనంలో జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్ష వర్గంగా కద్రక వెంకట స్వామి, జన్ని ముత్యాలు, పాలక రంజిత్ కుమార్ వ్యవహరించారు. గిరిజన సంక్షేమ సంఘం కార్యదర్శి తాడంగి సాయిబాబు, గిరిజన ఐక్య వేదిక నాయకులు బిడ్డిక తమ్మయ్య, అఖిల భారత రైతుకూలీసంఘం నాయకులు బొత్స నర్సింగరావు, గిరిజన సంఘం నాయకులు కద్రక రామాస్వామి, రైతుకూలీసంఘం సంఘం (ఆంధ్రప్రదేశ్) నాయకులు ఊయక ముత్యాలు, పి.శ్రీనునాయుడు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శు రెడ్డి వేణు, కె.మన్మధరావు, లిబరేషన్ నాయకులు సంగం తదితరులు మాట్లాడారు. శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటం ద్వారా ఐటిడిఎలు, జిసిసి, 1/70, జీవో 3 లాంటివి సాధించుకొన్నామని, అదే పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయ ప్రయోజనాల కోసం వైసిపి, టిడిపి పార్టీలు కేంద్ర బిజెపి ప్రభుత్వంతో కుమ్మక్కై గిరిజన/ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని అన్నారు. అడవుల నుంచి ఆదివాసీలను దూరం చేసి అడవుల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్రలను అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. గిరిజన జెఎసి నాయకులపై నిర్బంధం, అరెస్టులను సదస్సు తీవ్రంగా ఖండించింది. గిరిజన జెఎసి పోరాటాలకు సంఘీభావం ప్రకటించింది. గిరిజన ప్రజలకు నష్టం చేసే అసెంబ్లీ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని అంతా కలిసి వచ్చే అన్ని శక్తులను కలుపుకుని ముందుకు సాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. గిరిజన జెఎసి నాయకత్వంతో సంప్రదింపులు జరిపి ఐక్యంగా పోరాటాన్ని ముందుకు తీసుకు పోవాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ గణేష్, ఊయక గంగరాజు, ఉర్లక నాగార్జున, చందు, జనార్దన్, మహేష్, సోమేశ్, భాస్కరరావు, విశ్వేశ్వరరావు, రాయల సీతయ్య, పెద్దసంఖ్యలో ఆదివాసీలు, మహిళలు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌గా ఎ.సిరి

సీతంపేట ఐటిడిఎ పిఒగా కల్పనాకుమారి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎ.సిరిగా రానున్నారు. ఈమె స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆనంద్‌కు విశాఖ బదిలీ అయ్యింది. ఒ.ఆనంద్ ఎంతో చురుగ్గా ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసి, ఎన్నో ప్రజా సమస్యలకు చక్కని పరిష్కారం చూపి అందరి మన్ననలు పొందారు. సీతంపేట ఐటిడిఎ పిఒ నవ్య ఇక్కడి నుంచి బదిలీ కాగా, ఆమె స్థానంలో అనకాపల్లి జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి పిఒగా నియమితులయ్యారు.



ఎ.సిరి



కల్పనా కుమారి

అవస్థలు తప్పాయి...

సెల్‌టవర్ల ఏర్పాటుతో హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస

"సిగ్నల్స్ కోసం కొండలు ఎక్కే బాధ తప్పిందని ఊపిరిపీల్చుకుంటున్నారు జియ్యమ్మవలస మండలం గోర్లి, గుమ్మలక్ష్మీపురం మండలం బీరుపాడు గ్రామస్తులు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించి "డిజిటల్ విప్లవం" ప్రభావాన్ని స్వయంగా అనుభూతి పొందారు. గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లోని మారుమూల గ్రామాల్లో నిర్మించిన మొబైల్ టవర్లు, అందుబాటులోకి వచ్చిన టవర్లతో గ్రామస్తుల స్పందన చూడాలని, వారితో పంచుకోవాలని సంకల్పించారు. గోర్లి, బీరుపాడు గ్రామస్తులు తమకు వచ్చిన మొబైల్ సిగ్నల్స్‌తో ఆనందానుభూతిని పొందారు. గ్రాస్తులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.వీరి పర్యటన మార్గమధ్యలో రంగుపురం, ఇతర గ్రామాల్లో నిర్మించి టవర్లు పరిశీలించారు. అనంతరం బైక్‌పై బీరుపాడు వెళ్లి రహదారి, ఇతర పనులను పరిశీలించారు. అక్కడ టవర్లును పరిశీలించి, గ్రామస్తులతో ముచ్చటించారు. ఇటీవల కాలంలో ఫోన్ చేయాలంటే కొండలు ఎక్కాల్సి వచ్చేదని, పింఛను, రేషను కోసం బయో మెట్రిక్ వేయాలంటే చెట్టు పుట్ట చూడాల్సి వచ్చేదని, సిగ్నల్స్ కోసం గంటల తరబడి నిరీక్షణ చేసేవారమని, ఇప్పుడు సమస్య తీరని గిరిజనులు తెలిపారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 170 మొబైల్ టవర్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటిని జియో, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్ సంస్థలు నిర్మిస్తున్నాయని చెప్పారు. జూన్ నాటికి 160 టవర్లు పూర్తి అవుతాయని తద్వారా జిల్లాలో ప్రతి మారుమూల గ్రామంలో 4జి నెట్ వర్క్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని, 108, టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇటీవల 52 ప్రదేశాల్లో అటవీ శాఖ అనుమతులు మంజూరు చేశామని, రెవెన్యూ, పోలీస్, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ త్వరగా టవర్లు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ టవర్లను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టి.పి.ఎం.యు ఏపిడి వై. సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

టిడిపి, వైసిపి ప్రభుత్వాల మధ్య తేడా చూడండి

జగనన్నే మా భవిష్యత్తును ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో గతంలో టిడిపి ప్రభుత్వం ఎలా పని చేసిందో, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఎలా పని చేస్తున్నదో తేడా గమనించాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. పట్టణంలోని గుమడాంలో జగనన్నే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్తు అన్న కార్యక్రమాన్ని రాజన్నదొర శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి టిడిపి ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తి, వైసిపి ప్రభుత్వం హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల మధ్య తేడా తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. సిఎం ఫొటో వున్న స్టిక్కర్లను ఇంటి గోడల కు అతికించారు. తర్వాత లబ్దిదారుల సెల్ ఫోన్ వెనుక భాగంలో జగన్ ఫొటో స్టిక్కర్లను అంటించారు. 3,2,5వార్డుల్లో ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు తాడి శంకరరావు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, జగనన్న సచివాలయాల కన్వీనర్ గిరిరఘు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ,శ్యామలాంబ కోపరేటివ్ స్టోర్స్ వైస్ చైర్మన్ మోహనరావు పాల్గొన్నారు.

కురుపాం : నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో శివన్నపేట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ప్రారంభించారు. అనంతరం శివన్నపేటలో ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు,ఎంపీపీ శెట్టి పద్మావతి, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిషార్,జడ్పిటిసి జి.సుజాత, వైసిపి జిల్లా వాణిజ్య విభాగాల అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వం రావు, సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు వి.బంగారునాయుడు, సంతోషిని, టీవీఎస్ స్వామియోజులు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయచంద్రశేఖర్, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె. సురేష్ కుమార్, ఐదు మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజాసమస్యలు తెలుసుకుని,వారి సేవకు పునరంకితం అవడానికి మంచి అవకాశమని జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ అన్నారు. ఈ కార్యక్రమాన్ని కో-ఆర్డినేటర్, రథసారధులతో కలిసి ఇంటింటికి వెళ్లి వారిని పరిచయం చేసే కార్యక్రమం నిర్వహించారు. అలాగే డోకిశిల పంచాయితీలోని తేలునాయుడువలసలో ఎఎంసి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి ఇంటింటికి వెళ్లి పథకం ఉద్దేశాన్ని ప్రజలకు తెలిపారు. అనంతరం వారి అనుమతితో ఇంటికి, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లను అంటించారు. సూడిగాంలో ఎంపిపి మజ్జి శోభారాణి, వెంకంపేట, నరిసిపురంలలో వైస్‌చైర్మన్లు సిద్ధాజగన్నాధరావు, పూడిశంకరరావులు అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా, పుట్టూరు, గోపాలపురం, చినబొండపల్లి, ఎల్ఎన్‌పురంలలో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గుమ్మలక్ష్మీపురంలో ఎంపిపి కె దీనమయ్య ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు, మండల సచివాలయ కన్వీనర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కిషోర్, సచివాలయ కన్వీనర్లు గూనగంజి కష్ణారావు, వెంకట్రావులు, వార్డు మెంబర్లు, గృహ సారధులు వాలంటీర్లు మరియు వైసిపి నాయకులు వహీద్, బి. ఎల్, దొరబాబు, ఎద్దు మురళి, కొనిశ సూర్యం పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర





అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

ప్రమాదవశాత్తూ శిక్షణలో మృతిచెందిన మెరైన్ కమాండో చందక గోవింద్‌కు యువత, మండల ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. కిలోమీటర్ల మేర భారీ ర్యాలీగా సాగి అమర జవానుకు అశ్రునివాళులర్పించారు. సైనిక వాహనంలో గోవింద్ భౌతికకాయం చీపురుపల్లి మీదుగా స్వగ్రామం పర్ల వరకు సాగిన అంతిమయాత్రలో వేల సంఖ్యలో యువత, అభిమానులు బైక్‌లతో ర్యాలీగా సాగారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గోవింద్ మరణంతో పర్ల గ్రామం దు:ఖసాగరంలో మునిగిపోయింది.

- ప్రజాశక్తి, గరివిడి



సైనిక వాహనం వెంట బైక్‌లతో ర్యాలీగా సాగుతున్న యువత



గోవింద్ తల్లిని ఓదార్చుతున్న మాజీ ఎమ్‌పి ఝాన్సీలక్ష్మి



అధికార లాంఛనాలతో నివాళులర్పిస్తున్న సైనికులు

మళ్లీ పులి కలకలం

ముషిడిపల్లి సమీపంలో ఆవుదూడ మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నాలుగు నెలల క్రితం మండల వాసులను భయపెట్టిన పులి మరోసారి పంజా విసిరింది. మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన యల్లపు శ్రీరాములుకు చెందిన ఆవు దూడను చంపేసింది. శుక్రవారం తెల్లవారు జామున ముషిడిపల్లి-మధుపాడ మార్గంలోని గోస్తనీ నది తీరంలో శ్రీరాములు పశువుల పాకలో ఉన్న ఆవు దూడపై పులి దాడి చేసి, సమీపంలోని అరటితోటలోకి తీసుకెళ్లి చంపేసింది. సంఘటనా స్థలాన్ని ఆటవీశాఖ డిఆర్ఒ రవికుమార్ పరిశీలించారు. పాదముద్రలను పరిశీలించి, పులిగా నిర్ధారించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఇళ్ల వద్ద ఉండాలనీ రోడ్డుపైకి, పొలాల్లోకి రాకూడదని సూచించారు. పులి జాడ కనిపెట్టేందుకు రెండు ట్రాకింగ్ కెమెరాలను ఇక్కడ అమర్చారు. మండలంలో మరోసారి పులివార్త ప్రజలను భయాందోళనలోకి నెట్టేసింది.



చనిపోయిన ఆవుదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మక్కువ : మండలంలోని శంబర- కామిడివలస, ఎస్.పెద్దవలస గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు బొబ్బిలి విద్యుత్ శాఖ ఎఇ పి.హరి తెలిపారు. మక్కువ నుంచి మావుడి 33 కెవి లైన్లను పటిష్టం చేసే పనులు చేపడుతున్నామన్నారు. రోడ్డు క్రాసింగ్‌లు , తక్కువ క్లియరెన్స్ ఉన్న దగ్గర కొత్త స్తంభాలు ఎత్తే పనుల వల్ల శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కావున వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.


విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పాఠశాల విద్యార్థుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాల విద్యార్థులకు గతంలో నిర్వహించిన నేత్ర పరీక్షల్లో భాగంగా దృష్టి దోషం ఉన్న వారికి కళ్లజోళ్లు కోసం సిఫార్సు చేసిన వారందరికీ కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దొరజమ్ము ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అవసరమైన మేరకు 98 మంది విద్యార్థులకు ఆరోగ్యకార్యకర్తల ద్వారా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కంటి వ్యాధులు, నేత్రదానంపై అవగాహన, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


బాధితులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కురుపాం : మండలంలోని మొండెంఖల్ పంచాయతీలో గల తాడేలువలసకు చెందిన ఊయక మానయ్య, బిడ్డిక వెంకటరావుకు చెందిన రెండు పూరిళ్లు సోమవారం రాత్రి కాలిపోయాయి. దీంతో వారు నిత్యావసర సరుకులు, బట్టలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ ఎ.గౌరీశంకర్ బాధితులకు బట్టలు, బియ్యం, నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి గుడారి విద్యారాణి, మాజీ ఎంపిపి ఆరిమా ఇంద్ర కుమార్, వైసిపి నాయకులు ఐ.రామకృష్ణ, సచివాలయం కన్వీనర్ రేవు సత్తిబాబు, వాలంటీర్ ఉపేంద్ర పాల్గొన్నారు.


బిళ్లగుడ్డివలసలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు జగదీష్

జీతాలు, నిధులు ఇవ్వని ప్రభుత్వం

పార్వతీపురంరూరల్ : సంక్షేమ పథకాలు అమలు పేరిట రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, పనిచేసే ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు, పంచాయతీలకు కనీస నిధులు ఇవ్వలేని పరిస్థితికి ప్రభుత్వం చేరుకుందని మాజీ ఎమ్మెల్యే ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మలగపంచాయితీ, బిళ్లగుడ్డివలసలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, పెరిగిపోతున్న ధరలు, పెంచిన చార్జీలు గురించి వివరించారు. రాబోవు కాలంలో ప్రభుత్వాన్ని గద్దెదింపి తెలుగుదేశాన్ని అధికారంలోకి తీసుకురావడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, నాయకులు అరకు పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, నాయకులు ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

బూరుజోలలో...

భామిని: మండలంలోని బూరుజోలలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రం కార్యక్రమం నిర్వహించారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసే ఆదివారం పరిస్థితిలో గిరిజన ఎంఎల్‌ఎలు లేరన్నారు. అని, రాష్ట్ర పరిస్థితి, స్థితి గతులు మారాలంటే టిడిపితోనే సాధ్యం అవుతుంది అని, ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రజలు టిడిపి గెలిపించాలని కోరారు. కార్యక్రమం టిడిపి ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మండలం అధ్యక్షులు బోగాపురపు రవి నాయుడు, సాకేటి రామారావు, వలురౌతు చిట్టిబాబు, కోరాడ రాజేష్, గురిబిల్లి లక్ష్మీపతి, పోతల సత్యనారాయణ, బిడ్డిక ప్రసాద్, లోపింటి రాజేష్ వున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుయువత నాయకులు మహేంద్రనాయుడు

రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారు

పాలకొండ రూరల్ : రాష్ట్రాన్ని వైసిపి డ్రగ్స్ ప్రదేశ్‌గా మార్చేశారని అరకు పార్లమెంటరీ తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్రనాయుడు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో 'సే నో టు డ్రగ్స్' అనే కార్యక్రమం చేపట్టారు. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా ఉన్న రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని అన్నారు. దేశంలో అత్యధికంగా డ్రగ్స్ పట్టుబడిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టారని విమర్శించారు. టిడిపి హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్, ఉపాధి హామీ పనుల్లో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంటే ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాలో నంబర్ వన్‌గా ఉందని అన్నారు. ఇటువంటి అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో దుప్పాడ నారాయణరావు, గుమ్మడి సింహాద్రి, మజ్జి జయశంకర్, వావిలపల్లి రమణ మూర్తి తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

జామి : జామి మండల కేంద్రానికి చెందిన వాన దేముడు (65) శుక్రవారం పురుగుల మందు తాగి మృతి చెందాడు. దేముడు కోడలు శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దేముడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బాధలు తట్టుకోలేక పురుగుల మందు తాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు


భామిని : బత్తిలిలో శిలువ రూపంలో ఏసును ఊరేగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక రావాడ జంక్షన్ సమీపంలో గల గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ పి.జీవన్ కుమార్ ప్రకాష్ అధ్వర్యంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల ప్రాముఖ్యతను బోధించారు. క్రైస్తవ సోదరులంతా తమ కుటుంబాలతో కలిసి చర్చిలోప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘపెద్దలు డి.జాన్,డి. రాజారత్నం, డి.ప్రదీప్, డి.జయ కుమార్, కె.సుదర్శన్, కె.ఈశ్వరరావు, జి.సుధాకర్, డి.మజ్జిబాబు, అధిక సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవు లు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సవర కోటపాడు, పి. లేవిడి చర్చిలు నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు క్రైస్తవ సిలువతో ర్యాలీగా వెళ్లారు. ఎస్‌కె పాడు విచారణ ఫాదర్ చార్లెస్, సంకిలి ఫాదర్ జేమ్స్ బ్రదర్, దేవానంద్ ప్రార్థనలు నిర్వహించారు.

జియమ్మవలస: మండలంలోనిపలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఎత్తున ప్రార్థనలు చేపట్టారు.

సీతంపేట : స్థానిక విచారణ క్యాథలిక్ సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా కంబగూడ లొయోలా సెంటర్ నుండి పత్తికగూడలో కొండ మీద ఉన్న ఫాతిమామాత దేవాలయానికి పాదయాత్రగా వెళ్లి సిలువ మార్గం చేపట్టారు. కార్యక్రమంలో సీతంపేట విచారణ చర్చి ఫాదర్లు జయశీలన్, అశోక్, జోజి, విచారణ మఠకన్యలు ఝాన్సీ, రీటా తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం ఆర్‌సిఎం, తెలుగు బాప్టిస్ట్ చర్చితో పాటు తల వరం, తూడి, కంబర, గడగమ్మ, తదితర దేవాలయాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ఆర్‌సిఎం చర్చి వరకు సిలువను ఎత్తుకొని వెళ్లారు. కార్యక్రమంలో పాస్టర్ పి విన్స్‌కుమార్, సంఘ కార్యవర్గ సభ్యులు ఎస్.సుహాస్ కుమార్, కె. సాల్మన్ రాజు, ఎస్.ప్రకాష్, ఎన్‌వి భాస్కరరావు, కల్యాణ్ ప్రసాద్, ఎన్.రమేష్ కుమార్, సంఘస్తులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక బెలగాం ఆర్‌సిఎం చర్చిలో నిర్వహించిన ప్రార్థన కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ఎపిజివిబి రిటైర్డ్ మేనేజర్ కాగాన ప్రకాష్, గర్భాపు శోభన్‌బాబు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.


కురుపాంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భామిని : మండలంలోని బత్తిలిలో ఫాదర్ చార్లెస్, ఫాదర్ రాజు, బ్రదర్ అంథోని ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిలువ యాత్ర నిర్వహించి, శిలువ వేసే ముందు జీసస్ 14 ప్రదేశాల్లో ఏ విధంగా బాధింపపబడ్డారన్న అంశాలను జీసస్ వేషా ధారణలో బత్తిలి పుర వీదుల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

పూర్ణపాడు -లాబేసు వంతెన పనులు ప్రారంభించాలి

కొమరాడ : మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు – లాబేసు వంతెన పనులు పున: ప్రారంభించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం నాయకులు వంతెన ప్రాంతాన్ని పరిశీలించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ 9 పంచాయతీలకు 65 గిరిజన గ్రామాలతో పాటు కురుపాం, గుమ్మలక్ష్మంపురం, జిఎంవలస, గరుగుబిల్లి మండలాలకు సంబంధించిన ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పూర్ణపాడు వంతెన ఎప్పటికి పూర్తవుతుందో ప్రశ్నార్ధకంగా ఉందని అన్నారు. 2006లో రూ.3కోట్ల 50 లక్షలతో ప్రారంభించిన పనులు నేటికి రూ.14 కోట్లయినా 50శాతం పనులు కూడా ప్రారంభించలేదన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి గిరిజనుల ప్రాణాలకు భరోసా కల్పించేలా వంతెను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని, తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, గిరిజనులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల పరిశీలన

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు పంచాయతీ పరిధి బిడ్లపాడులో ఇటీవల నిర్వహించిన జగనన్న భూ రీ సర్వే పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కొలతరాళ్లను శుక్రవారం పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ పరిశీలించారు. హద్దుల ప్రకారం కొలతరాలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పాలకొండ మండలంలోని ఎకరాయిపురంలోనూ కొలతరాళ్లను పరిశీలించారు.

వెంపలగూడలో సమస్యల తిష్ట

బ్రిడ్జి సమస్య తీరేదెప్పుడు?

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుట్టి పంచాయతీ వెంపలగూడ రోడ్డు పక్కన ఉన్న గ్రామమైనప్పటికీ అభివృద్ధికి ఆమాడ దూరంలో ఉంది. ఈ గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ గ్రామంలో 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 18 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో కొన్నింటికి బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సిసి రోడ్లు, కాలువలు లేకపోవడంతో వరద నీరు, మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్లు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వరదగోడ లేకపోవడంతో నీరు లోపలికి వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. కావున తక్షణమే వరద గోడ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో కమ్యూనిటీ హాల్ లేదు. గ్రామస్తులను తాగునీటి సమస్య నిత్యం వెంటాడుతుంది. గ్రామంలో ఒక్క నేలబావి కూడా లేదు. ఉన్న ఒక్కగానొక్క బోరును పావుగంట పాటు కొడితేగాని బిందనీరు రావడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామ శివారును గల పాతబోరుకు ఊరంతా కలిసి మోటార్ బిగించుకొని నీరు తెప్పించుకుం టున్నారు. అయితే భూగర్భ జలాల అడుగంటి పోవడంతో ఆ బోరు నుంచి కూడా నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు గెడ్డనీటిపైనే ఆధారపడుతున్నామన్నారు.

ప్రధానంగా ఐదేళ్ల క్రితం సంభవించిన తిత్లీ తుపానుకు రేగులగూడ బ్రిడ్జి కూలిపోయింది. ఇక్కడి చిన్నారులు దగ్గర్లో ఉన్న రేగులుగూడలో బడికి వెళ్లేవారు. ప్రస్తుతం బ్రిడ్జి లేకపోవడం వర్షాకాలంలో నీటి ప్రవాహం ఎక్కువగా రావడంతో చిన్నారులు రెండున్నర కిలోమీటర్లు దూరంలో ఉన్న గుమ్మడ పాఠశాలకు నడిచివెళ్తున్నారు. ఇప్పటికే ఐదేళ్లు గడుస్తున్నా, ఎన్ని వినతి పత్రాలు సమర్పించినా ప్రయోజనం లేదని గ్రామస్తులు ఆవేదన చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వెంపలగూడలోని సమస్యలను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.


కాలువలు, సిసి రోడ్డు లేని వెంలగూడ గ్రామం

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఓ కల్యాణ మండపంలో నువ్వే మా భవిష్యత్తు జగనన్న నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వ పాలనను వివరించాలన్నారు. గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లకు నువ్వే మా భవిష్యత్తు జగనన్న కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. జగనన్నే మా భవిష్యత్తు (మా నమ్మకం – నువ్వే జగన్) కార్యక్రమం ద్వారా సీఎం వైయస్ జగన్ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి, గ్రామ, రాష్ట్ర అభివృద్ధి గురించి, ప్రజలుకు చేస్తున్న సేవలను గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్క కుటుంబం దగ్గరకు వెళ్లి క్లుప్తంగా తెలపాలన్నారు. 2024 లో జరిగే ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గం నుండి వైసిపిని గెలిపించే దిశగా సర్పంచ్లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు, గ్రామ వాలంటీర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

జగనన్నే మా భవిష్యత్తు విజయవంతం చేయండి:

సాలూరు : ఈనెల 7నుంచి 14రోజుల నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లే ఈ కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 4500మంది సచివాలయం కన్వీనర్లు, గహ సారథులు వున్నారని చెప్పారు. నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి చెప్పుకోడానికి ఇది గొప్ప అవకాశమని అన్నారు. టిడిపి హయాంలో చేసిన అవినీతి, అక్రమాల గురించి వివరించాలని సూచించారు. సమావేశంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెఎస్ కన్వీనర్ గిరిరఘు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ వున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు

గుమ్మలక్ష్మీపురం : ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం, బోర్లు, బావుల వద్ద క్లోరినేషన్ చేయించినట్లు తెలిపారు. గ్రామంలో మురికికుంటలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కాచివడబోసిన నీటిని తాగాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఆశా వర్కర్లు ఉన్నారు.

14 నుంచి చట్టభద్రతపై గ్రామసభలు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 14 నుంచి చట్టభద్రతపై గ్రామసభలు జరుగుతాయని ఇఒపిఆర్‌డి కెకె వర్మ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామపంచాయతీల్లోనూ ఈ చట్టభద్రత గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఈ గ్రామసభలకు పంచాయతీ కార్యదర్శులు ఆయా ప్రభుత్వ రంగ అధికారులకు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు ముందుగా నోటీసులు ఇచ్చి గ్రామసభలు నిర్వహణకు సన్నద్ధం చేసుకోవాలన్నారు. ఈ గ్రామ సభలకు ఎంపిడిఒ, తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు ఈ సభలకు పాల్గొంటారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకే పురస్కారాల పట్ల హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పదో తరగతిలో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు అందజేసే విద్యా పురస్కారాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిమితం చేయడం హర్షించ దగ్గ విషయమని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో విడుదల చేసిన ఉత్తర్వులు 82 అమలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే అమ్మవడి వంటి పథకం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్వ శిక్షా అభియాన్ లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే కుటుంబాన్ని ఎలా పోషించగలరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నాగావళిలో పెరిగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని నాగావళి నదిలో శుక్రవారం ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. ఇంతవరకు నదిలో నీరు తక్కువగా ఉండటం వల్ల వంగర, వీరఘట్టం మండలాల ప్రజలు నాగావళిలో రాకపోకలు సాగించేవారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగింది. దీంతో తోటపల్లి గేట్లు ఎత్తి నాగావళి నదిలోకి నీరు విడిచిపెట్టడంతో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

డిసిఎంఎస్ టర్నోవర్ లక్ష్యం రూ.21 కోట్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

2023-24లో డిసిఎంఎస్ వార్షిక టర్నోవర్ లక్ష్యం రూ.21 కోట్లని చైర్‌పర్సన్ అవనాపు భావన అన్నారు. బొబ్బిలిలో ఉన్న డిసిఎంఎస్ ఆస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది రూ.19 కోట్లు టర్నోవర్ చేశామన్నారు. ఈ ఏడాది రూ.21 కోట్లకు పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. డిసిఎంఎస్ ద్వారా వివిధ సంస్థలకు, దేవాలయాలకు, విద్యాలయాలకు ఆహార పదార్థాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, డైరెక్టర్ గొట్టాపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

రహదారులు ఇలా... ప్రయాణం సాగేదెలా?

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండల పరిధిలోని పలు గ్రామాల రహదారులు గుంతలమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అయితే ప్రయాణం సాగేదెలా అని వాహన చోదకులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని లంబూరు, ఓని తదితర గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు మీద పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. లుంబూరుకు వెళ్లే తారు రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. రహదారిలో పెద్ద పెద్ద గుంతలు పడడంతో పాటు రాళ్లు తేలిపోవడంతో వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే రహదారికి ఆనుకుని జగనన్న పాలకొండ అర్బన్ లేఅవుట్ ఉంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని కూడా ఈ రహదారి గుండా తీసుకెళ్లాల్సి ఉంది. రహదారి గోతులమయంగా ఉండడంతో ఇంటి సామాగ్రి తీసుకు వెళ్లే సమయంలో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడితే రోడ్డుపై నీరు నిలబడడంతో ఎక్కడ గుంతలున్నాయో కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


అధ్వానంగా ఉన్న లంబూరు రోడ్డు


నవధాన్యాల సాగుతో నేల బాగు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నవధాన్యాల సాగు వల్ల భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. గరుగుబిల్లి మండలం సంతోష్‌పురం పంచాయతీ పరిధిలోని పిట్టలమెట్టలోని రైతులతో శుక్రవారం నవధాన్యాలు సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి 10నుంచి 30రకాలు విత్తనాలు, నవ ధాన్యాలు వేయడంతో సాధ్యం పడుతుందని అన్నారు. ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు భూమిలో ఈ నవ ధాన్యాలు సాగు వల్ల లభ్యం అవుతుందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఆరు జిల్లాల పరిధిలో తొలకరి వర్షాలు పడే ముందు ఎకరాకు 10కేజీలు చొప్పున అన్ని రకాల విత్తనాలు కలుపుకొని భూమిలో వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. రాబోయే తరానికి, ప్రకృతిని పరిరక్షించడాన్ని అందరు రైతులు ప్రకతి వ్యవసాయం చేయాల్సి ఉందని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం, అందు బాటులోని ఆర్‌బికెలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్, కో-ఆర్డినేటర్ హేమ సుందర్, డివిజనల్ ఎంకర్ పర్సన్ జి.అన్నపూర్ణ, మార్కెటింగ్ ఎంప్టీ మహేష్, బాలామణి, నరసింహ రైతులు, కార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ సవరకలిగొట్టులో రైతుమిత్ర, మహిళా సంఘాలు, మహాత్మా గాంధీ, శివాజీ సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో విత్తనాలు, విత్తన బంతులపై శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగుపై సలహాలు, సూచనలు అందించారు. 30రకాల విత్తనాలను 12 కేజీలు చొప్పున రైతులు స్వయంగా సేకరించినట్లు రైతు సంఘాల డైరెక్టర్ చిన్నారావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో విత్తనాలకు విత్తనబంతులు తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఆవు మూత్రం అవసరమని, కావున ఒక్కొక్క రైతు రెండు ఆవులు చొప్పున కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. భూమిలో ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా అధిక ఆదాయం పొందడానికి అంతర్ పంటలు, కిచెన్ గార్డెన్, శ్రీ రాగితో పాటు చిరుధాన్యాలు పండిస్తామని రైతుల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి కద్రక దీప, రైతు సంఘాల సభ్యులు టి.రమేష్, బిడ్డిక కొండలరావు, పత్తిక ప్రసాద్, పి.రామారావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బహుళ పంట విధానంతో అధికదిగుబడులే కాకుండా నేలలు సారవంతమౌతాయని ఎపిపిసిఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్, షణ్ముఖరాజు, టెక్నికల్‌లీడ్ మేనేజర్ శ్రీప్రకాష్, ఆర్‌టిఒ హేమసుందర్ అన్నారు. శుక్రవారం పెదబొండపల్లిలో పర్యటించిన వారు రైతులకు బహుళపంటల విధానంపై అవగాహన కల్పించారు. నువ్వుల పంటలో తోటకూర, గోంగూర, మినుము, దొండ, అపరాలు, చిక్కుడు, బీర, ఆనప, సుగంధద్రవ్యాలు పెంచుకోవడం వల్ల అదనపు లాభాలు పొందవచ్చన్నారు. పంటకాలం ముగిసిన తర్వాత వాటిని కలియదున్నడం ద్వారా భూమిసారాన్ని పెంచవచ్చని వివరించారు.


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు